నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | జనవరి 06, 2025 | www.navatelangana.com

కొనసాగుతున్న హమాలీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెంచిన రేట్లకు సంబంధించి జీఓ జారీ చేయాలంటూ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె 5వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ హమాలీ రేట్లు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి సంబంధించి జీఓను వెంటనే విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసరదారులకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలన్నారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికులకు ఇన్సూరెన్స్ అందించాలన్నారు. బోనస్ రూ.పదివేలకు పెంచాలని, పదవి విరమణ చెందిన కార్మికుల పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా నాయకులు శ్రీనివాస్, తుకారం, మోహన్, కొమురక్క పాల్గొన్నారు.

మాలీ సంఘం ఎన్నికల నామినేషన్ స్వీకరణ

నవతెలంగాణ-కౌటాల



మాలీ సంఘం ఎన్నికల కమిటీ సభ్యులకు ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆదే వసంత్ రావు కౌటాల మండల ఎన్నికల కమిటీ సభ్యునిగా ఉన్న మోర్లె పాండురంగ్‌కు ఎన్నికల నామినేషన్ సమర్పించారు. మండల కేంద్రంలోని మాలీ సంఘం భవనంలో నామినేషన్ల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని మాలీ కులస్తులంతా ఏకతాటిపైకి వచ్చి జరగబోయే మాలీ సంఘం ఎన్నికల్లో తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గెలిపించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్జీఎల్ఐ, సరెండర్, పెన్షనరీ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తీసుకురావాలన్నారు. బదిలీలలో సాంకేతిక కారణాలవల్ల నష్టపోయిన ఉపాధ్యాయుల అప్పీళ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి, ఎంఈఓ, డైట్ లెక్చరర్, డిప్యూటీ డీఈఓ పోస్టులకు పదోన్నతులు కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజన బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను తప్పించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్‌రెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకొని అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ.మురళీ మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పి.మొగులయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డి.మల్లారెడ్డి, మాజీ సహా అధ్యక్షుడు ఎస్.రాజేశ్వరరావు, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఎం.జలంధర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా అధ్యక్షులు టి.రవికాంత్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు బి.శాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి పి.సదాశివ్, రాష్ట్ర నాయకులు రంగినేని రామారావు, ఎ.లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, బలిరాం పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన దుండగుల అరెస్ట్

నవతెలంగాణ-సారంగాపూర్

యువకుడిపై హత్యాయత్నం జరిగిన సంఘటన మండలంలోని బోరిగాం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కాగా ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు వివరాలను వెల్లడించారు. మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన షేక్ అర్షద్‌కు అదే గ్రామానికి చెందిన బొబ్బిలి సాయికుమార్‌కు డిసెంబర్ 31 మంగళవారం రాత్రి చిన్న గొడవ జరిగింది. అది మనసులో పెట్టుకొని బొబ్బిలి సాయికుమార్‌తో పాటు మరో మైనర్ స్నేహితునితో కలిసి ముందుగా అనుకున్న ప్రకారం షేక్ అర్షద్‌పైన దాడి చేయాలని, నిర్ణయించుకొని పథకం ప్రకారం శనివారం రాత్రి సమయంలో అర్షద్‌ని బోరిగాంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు పిలిపించి, బొబ్బిలి సాయికుమార్ కత్తితో అర్షద్ నడుము భాగంలో పొడిచి పారిపోయాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, నిందితులను 24 గంటల్లో నింధితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి కత్తి, మోటార్ సైకిల్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ రామకృష్ణ తెలిపారు. ఇందులో ఎస్సై శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాంత్‌రెడ్డికి డీసీసీ ఇచ్చేంతవరకు చెప్పులు వేసుకోను

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ కుటుంబం మూడు తరాలుగా కాంగ్రెస్‌కు సేవలు అందిస్తుందని డీసీసీ అధ్యక్ష పదవీకి ఆయన అర్హుడని, ఖుర్షీద్‌నగర్‌కు చెందిన కార్యకర్త అజార్‌ఖాన్ పటేల్ అన్నారు. శ్రీకాంత్‌రెడ్డికి డీసీసీ అధ్యక్ష పదవి ఇచ్చేంత వరకు తను పాదరక్షలు వేసుకోనని చెప్పులను వదిలాడు. ఆదివారం ఎన్టీఆర్ చౌక్‌లో కాంగ్రెస్ నాయకులు ఆయన పాదరక్షలను తీసి సంకల్పానికి శ్రీకారం చుట్టారు. మూడు తరాల నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న కుటుంబం నుంచి శ్రీకాంత్‌రెడ్డి వచ్చారని అన్నారు. నిబద్ధత గల నాయకుడిలా ఆయన ఎంతో సేవలు అందిస్తున్నారన్నారు. డీసీసీ అధ్యక్ష పదవీకి ఆయన సరైన వ్యక్తి అని తెలిపారు. పార్టీ అధిష్టానంతో పాటు పెద్దలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముభారక్, ఇర్ఫాన్, సలీం, ఖయ్యూం, ఫయాజ అహ్మద్ షామ, అయ్యూబ్, నహీద్, సమీరుల్లా ఖాన్, భగత్, సంగీత, జుబేద బేగం, ఖమర్ బేగం పాల్గొన్నారు.

వట్టివాగు కాలువ పూడికతీత పనులకు నిధులు మంజూరు

నవతెలంగాణ-రెబ్బెన

వట్టివాగు ప్రాజెక్ట్ పరిధిలోని డి2 నుండి డి10 కాలువలలో పూడికతీత పనుల కోసం రైతులు కుమురం భీం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు దృష్టికీ తీసుకొవచ్చారు. ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దనసారి సీతక్క సహకారంతో పూడికతీత పనులకు రూ.3 లక్షలు మంజూరు చేయించారు. మరో రూ.రెండు లక్షలు పనుల కోసం అంచనా వేసి మంజూరుకు పంపించారు. మొత్తం రూ.5 లక్షలు మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావుకి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెడువాయి ఉన్నత పాఠశాలలో నేటి నుండి ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించనున్నారు. నేటి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ నాయకులు రాచకొండ కృష్ణ, సముద్రాల రాజన్న, రామగోని శంకర్ గౌడ్ తెలిపారు. ఈ అల్పాహార కార్యక్రమాన్ని పదవ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పది పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు.

ఆటో డ్రైవర్లు లైసెన్సులు తీసుకోవాలి

నవతెలంగాణ-బెజ్జూర్

ఆటోడ్రైవర్లు లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై కే.ప్రవీణ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు లైసెన్సులు చూసుకోవాలని సూచించారు. లైసెన్సులు లేని డ్రైవర్లు డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తు ప్రమాద రహితంగా ఆటోలు నడపాలన్నారు.

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం డీసీసీ అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.సునీల్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, కోశాధికారి ఎం.రవికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులు కె.శంకర్ ఉపాధ్యక్షులు ఎస్.బాపయ్య, పి.ముత్యం, శివశంకర్ పాల్గొన్నారు.

సాయం దక్కేదెవరికీ..?

- వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయంపై ఆతృత
- భూమిలేని, ఉపాధి హామీ కూలీలకు ప్రాధాన్యం
- సర్కారు మార్గదర్శకాల కోసం అందరిలో ఆసక్తి
- సంక్రాంతి నుంచి అందజేయాలని ప్రభుత్వం యోచన

ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో భాగంగా మరో పథకం అమలుకు రూపకల్పన చేస్తోంది. రైతుభరోసా పథకంలో భాగంగా వ్యవసాయ కూలీలకు సైతం ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. వ్యవసాయ కూలీ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న నిరుపేదలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని భావిస్తోంది. రానున్న సంక్రాంతి పండగ నుంచి ఈ పథకాన్ని ప్రారంభించాలని యోచిస్తున్న తరుణంలో అవసరమైన మార్గదర్శకాలను రూపొందిస్తోంది. ఈ సాయం ఎవరికి వస్తే బాగుంటుందనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. భూమిలేని నిరుపేదలతో పాటు ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాలకు ఈ పథకం కింద ప్రాధాన్యమివ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లోనే మార్గదర్శకాలు వెలువడనున్న దృష్ట్యా లబ్దిదారుల్లో ఆతృత మొదలైంది. ప్రభుత్వం ఈ పథకం ఎవరిని పరిగణనలోకి తీసుకుంటోందనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.





నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్తు సౌకర్యం, రూ.500 వంట గ్యాస్ సబ్సిడీలను వర్తింపజేస్తుండగా.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. మరోపక్క ఇప్పటికే రూ.2లక్షల కంటే తక్కువగా ఉన్న రైతులకు బ్యాంకు రుణాలు మాఫీ చేసింది. రైతుభరోసాను సైతం సంక్రాంతి నుంచి అందజేయాలని నిర్ణయించింది. వీటితో పాటు వ్యవసాయ కూలీలకు సైతం ఏడాదికి రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చింది. ప్రస్తుతం ఈ హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే ఈ సాయాన్ని అసలే భూమి లేని నిరుపేదలతో పాటు ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పని పూర్తయిన కుటుంబాలకు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. వీరి కుటుంబంలో ఒకరిని లబ్దిదారుగా గుర్తించి అందించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సాయాన్ని కూడా సంక్రాంతి నుంచి ప్రారంభిస్తామని చెబుతున్నప్పటికీ.. ఎవరికి అందజేయాలనే కచ్చితమైన విధివిధానాలు ఇంకా వెల్లడించడం లేదు. నిబంధనలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

వంద రోజులైతే..కొందరికే సాయం..!

ప్రభుత్వం ఈ పథకం కింద లబ్దిదారుల ఎంపిక చేపడుతోంది. అసలే భూమి లేని నిరుపేదలతో పాటు ఉపాధిహామీలో వంద రోజులు పూర్తిచేసుకున్న కుటుంబాలకే ఈ సాయం అందించాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఈ నిబంధనను పరిగణనలోకి తీసుకుంటే మాత్రం ఉమ్మడి జిల్లాలో చాలా తక్కువ మందికి ఈ సాయం అందుతుంది. ఎందుకంటే ఉపాధిహామీ పనులు చాలా కుటుంబాలు చేస్తున్నా.. వంద రోజుల పని మాత్రం పూర్తిచేసుకోలేకపోతున్నాయి. ప్రస్తుతం 2024 ఏడాదిలో ఉపాధి పనుల్లో వంద రోజులు పూర్తిచేసుకున్న కుటుంబాల సంఖ్య అతి తక్కువగా ఉంది. ఈ సంఖ్య ప్రకారం చూస్తే మాత్రం చాలా తక్కువ మంది వ్యవసాయ కూలీలకు ఈ సాయం లభించనుందని తెలుస్తోంది. ప్రభుత్వం పూర్తిస్థాయి మార్గదర్శకాలు విడుదల చేస్తేనే ఎంత మందికి లబ్ది చేకూరుతుందోననేది స్పష్టమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో వంద రోజుల పని పూర్తి అయిన ఉపాధి కూలీల కుటుంబాలు

జిల్లా	ఉపాధికార్డులు	కూలీలు	వంద రోజులు పూర్తి
ఆదిలాబాద్	1.73లక్షలు	3.46లక్షలు	1176
ఆసిఫాబాద్	1.23లక్షలు	2.44లక్షలు	2271
మంచిర్యాల	1.21లక్షలు	2.36లక్షలు	1335
నిర్మల్	1.77లక్షలు	3.37లక్షలు	1707

మధ్యాహ్న భోజన కార్మికుల ఇబ్బందులు

- కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి



నవతెలంగాణ-జైపూర్

మధ్యాహ్న భోజన పథకం అమలు కోసం చేసిన అప్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎండీఎం యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి అన్నారు. ఆదివారం వేమనపల్లి మండల కేంద్రంలో సల్ల రాజక్క అధ్యక్షతన ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదలని ఆమె డిమాండ్ చేశారు. అప్పుల చేసి విద్యార్థుల ఆకలి తీర్చుతున్న కార్మికులకు వెంటనే బిల్లులు చెల్లించాలని అన్నారు. గత ఐదు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కోడి గుడ్లు ప్రభుత్వ పరంగా సరఫరా చేయాలని, ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలని, వంట కోసం గ్యాస్ ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేల చొప్పున వేతనాలు చెల్లిస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం కోసం అవస్థలు పడాల్సివస్తోందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తయినందున వెంటనే ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చందు, కరీంబీ, షేక్ తహెర, అదే లక్ష్మి, విజయ, పద్మ, గౌరక్క, వనిత పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు అన్నారు. ఆదివారం సీపీఐ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, ఇచ్చిన హామీలు, పెండింగ్ బిల్లులు, వేతనాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కుంటాల రాములు మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలను ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన హామీ అమలు లేదన్నారు. ఎండ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న కార్మికుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కోడి గుడ్డు పెట్టాలని చెబుతున్న అధికారులు, ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో రూ.7కు దొరుకుతుందన్నారు. కానీ ప్రభుత్వం రూ.ఐదుకు ఇవ్వడంతో మిగిత రెండు రూపాయలు కార్మికులపై భారం పడుతుందన్నారు. అంగన్‌వాడీలకు ఏ విధంగానైతే గుడ్లు సరఫరా చేస్తున్నారో మధ్యాహ్న భోజన కార్మికులకు కూడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు నాగమణి, గంగామణి, అనసూయ, పుష్ప, సౌందర్య, సుశీల, శశికళ, సత్యమ్మ, అనిత, లక్ష్మీ, రేఖ పాల్గొన్నారు.

పార్లమెంటరీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా పార్లమెంటరీ సమావేశం ఈనెల 6న జిల్లా కేంద్రంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలనీ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి పి.విశ్వనాథ్, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జెండా పండుగను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-బెజ్జూర్

భీమన్న దేవార జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పెద్దల సంతోష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ భీమన్న దేవార జెండాలు మండలంలో ఉన్న అన్ని గ్రామాలకు జెండాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కొలవార్ జాతీయ, రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు ఈనెల 8న రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, మండలాలు, గ్రామాల్లో 23వ భీమన్న దేవార జెండా ఆవిష్కరణ చేయాలని, ఆదివాసీ కొలవార్ ఆత్మగౌరవ దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. అదే విధంగా ఆదివాసీ కొలవార్ ఆడపడుచు లక్ష్మి దేవారను ఊరేగించినంతరం ఆటపట చేయాలని, సంస్కృతి, సాంప్రదాయాలను, ఆచరాచారాలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు అత్రం భక్కయ, ఇంజిరి రాజారాం, ఉపాధ్యక్షులు మనేపెల్లి మల్లేష్, మండల యువజన అధ్యక్షులు మనేపెల్లి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మనేపెల్లి గణేష్, మండల సంస్కృతిక కార్యదర్శి సంద్ర మల్లేష్, సర్‌మెడి కొడప శంకర్, పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పనులు పూర్తి చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో చేపట్టిన 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కొనసాగుతున్న 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందని, ఈ నేపథ్యంలో లక్షెట్టిపేట మండల కేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణాన్ని చేపట్టి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువలో అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, ప్రారంభానికి సిద్ధం చేసే విధంగా గుత్తేదారులు పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పూర్ణచందర్‌రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చల్ల నాగభూషణం, కోఆప్షన్ సభ్యుడు షాహిద్ అలీ పాల్గొన్నారు.

జాతరను ప్రారంభించిన మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అన్నారం భీమయ్య జాతరను మాజీ ఎంపీపీ మల్లికార్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడ పోటీలు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలు సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందిస్తాయన్నారు. రానున్న తరాలకు ఒక మంచి సమాచారాన్ని అందించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను ఒకే రకంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదిలాబాద్ రూరల్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని చాంద(టి) 44వ జాతీయ రహదారిపై మూడు ఆటోల నిండా 17క్వింటాళ్ల బియ్యాన్ని మహారాష్ట్రాకు తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. మూడు ఆటోలను సీజ్ చేయడంతో పాటు ముగ్గురు వ్యక్తులు షేక్ అక్రం, అక్బర్, ఎజాజ్ పట్టుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బుగ్గారాం(బి) గ్రామంలో ఆదివారం బుగ్గారాం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకొని, టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. యువకులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం మాట్లాడుతూ యువకులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని, చెడు వ్యసనాలకు బానిస కావొద్దని అన్నారు. యువకులకు ఎలాంటి సమస్యలు ఉన్నా ఒక అన్నలా మీతో ఉంటానని టోర్నమెంట్ మొదటి బహుమతిగా రూ.30వేలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ మాతృమూర్తి, అలాగే కుచులాపూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ సిరిపురం దాసు మాతృమూర్తి, మరణించారు. ఆదివారం విషయం తెలుసుకున్న రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



వనదర్శినిలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని వడూర్ అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వనదర్శిని కార్యక్రమంలో ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు ముందుగా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం హరితవనంలో మొక్కలు నాటారు. గ్రాస్ ల్యాండ్‌లోని నీటి కుంటను కాలినడకన అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. సఫారీలో తిరుగుతూ సోలార్ బోర్‌వెల్‌తో పాటు మొత్తం అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. పార్డి గ్రామానికి చెందిన చిరుతపులి దాడిలో గాయపడ్డ చందర్ మహరాజ్‌కి నష్టపరిహారంగా రూ.31వేలు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అటవీశాఖ వడూర్ గుట్టపైన ఉన్న అటవీ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్‌తో పాటు టవర్ ఏర్పాటు చేయాలని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని, అటవీ జంతువులు పాడుచేసిన పొలాలను నష్టపరిహారం అందించాలని అన్నారు. ఈ అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారులతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ముక్త సాల్వేకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదిగల ఆస్థిత్వం కోసం ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలూ మూలల నుంచి మాదిగ కులాలు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు రాజన్న, మాధవ్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేద్దాం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని పెద్దార్ల గుట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం గ్రామప్రజలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి అందరం కలిసి పని చేయాలని కమిటీ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం నిర్మాణం ఆంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఆలయ ప్రాంగణాన్ని మరింత సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు గ్రావేల్ పోయించడంతో పాటు లెవలింగ్ పనులపై సభ్యులు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఏఎస్పీని సన్మానించిన ఆప్ జిల్లా అధ్యక్షుడు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్, పార్టీ సభ్యులు ఆదివారం జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి డివిజన్ కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సబ్ డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్ మీనాను కలిసి పూలమొక్కని అందించి, శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్ డివిజన్‌కి యంగ్ ఆఫీసర్ రావడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, సోఫీ ఇలియాస్ సాయి అబ్దుల్ సాదిక్, జహీర్, హైమద్, సోఫి, ఇమ్రాన్, సోఫీ, కిషోర్ కుమార్, షాకీర్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన నాయకులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్‌ని ఆ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగతంగా బలోపేతంపై చర్చించారు. ఇందులో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి సామ రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

ముథోల్ కాంగ్రెస్‌లో లుకలుకలు..!

- మాజీ ఎమ్మెల్యే ఆరోపణలతో కలకలం
- స్థానిక ఎన్నికల వరకు సర్దుకుంటుందా...?



నవతెలంగాణ-ముథోల్

ముథోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గత సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన నాయకుల తీరు మారటం లేదని, కార్యకర్తలు బహిరంగంగా పేర్కొంటున్నారు. ముథోల్ నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తేవడానికి కృషి చేయాల్సిన నాయకుడే సదరు పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు, విమర్శలు గుప్పించడం తాజాగా చర్చానీయఅంశంగా మారింది. ముథోల్ నియోజకవర్గం గతంలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేది. అయితే గత రెండు పర్యాయాలుగా కాంగ్రెస్ సార్వత్రిక ఎన్నికల్లో చతికిల పడిపోయింది. అయితే తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మళ్లీ ముథోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి రాష్ట్ర అధిష్టానం అన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, నియోజకవర్గ నాయకుల అధిపత్య పోరుతో, తగాదాలతో పార్టీని బజారుకీడుస్తున్నారన్న ఆరోపణలు సీనియర్ కార్యకర్తల నుండే సర్వత్రా వినిపిస్తున్నాయి. అయినా పార్టీ నాయకులపై పరోక్షంగా గాని, ప్రత్యక్షంగా గాని ఆరోపణ చేస్తే పార్టీ దెబ్బతింటుందని సొంత పార్టీ కార్యకర్తలు మండిపడుతున్నారు. ముందే నియోజకవర్గంలో బలంగా ఉన్న బీజేపీకి కాంగ్రెస్ గ్రూపు తగాదాలు మరింత నాటుకపోవటానికి ఊతమిచ్చినట్టు అయిందని పలువురు కార్యకర్తలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. తాజాగా గత రెండు రోజుల కింద ముథోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ముథోల్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గతంలో పనిచేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయటం చర్చకు దారితీసింది. సదరు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి నెలలు గడుస్తున్న గతంలో అభివృద్ధి చేయలేదని మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు చేయడంపై సొంత పార్టీ కార్యకర్తల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ సొంత పార్టీ మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయటం సరికాదని, ముథోల్ మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఖండించారు. అంతేకాకుండా ఒకే పార్టీలో ఉంటూ నాయకులపై విమర్శలు చేస్తే రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దెబ్బతింటుందని, కాంగ్రెస్ మండల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యే రెండు రోజుల కింద చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో పెద్ద దుమారాన్ని లేపాయి. రాజకీయాల్లో అపార అనుభవమున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ తన పార్టీ మాజీ ఎమ్మెల్యేపై కావాలనే ఆరోపణలు చేశాడా, లేక అనుకోకుండా అన్నాడా అన్న విషయం తేలాల్సింది. కాంగ్రెస్ పార్టీలో ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకోవటం గతంలో తరచు జరుగుతుండేది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి అయిన తర్వాత రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌లో బహిరంగంగా సీనియర్ నాయకులు కూడ మాట జారడం లేదు. అయినా ముథోల్‌లో మాత్రం మాజీ ఎమ్మెల్యేపై తీవ్రస్థాయిలో అభివృద్ధి చేయలేదని, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ఆరోపించడం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఏదేమైనా రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ముథోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో అధిపత్య పోరు పక్కనపెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారో లేదో వేచి చూడాలి మరి..!

రైతు అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

రైతన్న మేలుకోరే ఏకైక ప్రభుత్వం తమదని, అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని కడెం ప్రాజెక్ట్ దిగువన రబీ పంట సాగు చేసే రైతుల వ్యవసాయ పొలాలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు మరమ్మత్తులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9కోట్ల 46 లక్షలు మంజూరు చేసిందని, పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకోని పూడికతీతకు పూనుకుందని తెలిపారు. 10ఏండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును గాలికి వదిలేసిందని మండిపడ్డారు. 1సంవత్సరంలోనే ప్రాజెక్టుకు పునర్ వైభవం తీసుకొచ్చామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో కడెం ప్రాజెక్ట్ మళ్లీ పూర్వవైభవం సంతరించుకుందని అన్నారు. యాసంగి పంట పండించే రైతులు, నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. 17వేల ఎకరాలకు నిరందుతుందని, సకాలంలో పంటలను పండించాలన్నారు. త్వరలో రైతు భరోసా పథకం కింద రూ.12వేలు అందిస్తామని తెలిపారు. సాగు రైతులతో పాటు కౌలు రైతులకు సైతం ప్రభుత్వం చేయూత నందించనుందని పేర్కొన్నారు. కొందరు రైతులను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక చొరవతో నిర్మల్ జిల్లా ఆర్టీఏ మెంబర్‌గా తుమ్మల మల్లేష్ యాదవ్‌ను ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మల్లేష్ యాదవ్‌ను మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ మండల నాయకులు, జిల్లా నాయకులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెక్ పోస్టును మూసివేయడం సరికాదు



నవతెలంగాణ-ఉట్నూర్

గతంలో ఎన్నడు లేని విధంగా రాత్రి తొమ్మిది గంటల తరువాత కవ్వాల్ అభయ్యారణ్యం గుండా చిన్న వాహనాలు వెళ్లకూడదని అటవీ అధికారులు కొత్త నిబంధనలు తీసుకోరావడంతో శనివారం రాత్రి ఉట్నూర్ మండలం కొత్తగూడ చెక్ పోస్ట్ వద్ద భారీగా కార్లు, ఇతర చిన్న వాహనాలను చెక్ పోస్ట్ సిబ్బంది నిలిపివేశారు. దీంతో ఎముకలు కొరికే చలిలో కార్లలో ప్రయాణిస్తున్న స్త్రీలు, వృద్ధులు పడరాని పాట్లు పడ్డారు. చెక్ పోస్ట్ వద్ద భారీగా చిన్న వాహనాలు నిలిచిపోయాని తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అర్ధ రాత్రి 12 గంటలకు కొత్తగూడ చెక్‌పోస్ట్‌కు చేరుకొన్నారు. అక్కడ ప్రయాణికులతో మాట్లాడారు. చలిలో వారు పడుతున్న బాధలు చూసి చలించి పోయారు. చెక్ పోస్ట్ సిబ్బందిని నిలదీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తాము వాహనాలు నిలిపి వేసామని చెప్పడంతో ఎమ్మెల్యే నిర్మల్ ఎఫ్డీపీటీ శాంతారాంతో ఫోన్‌లో మాట్లాడారు. కొత్త నిభంధనలు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేనే కాకుండా వైల్డ్ లైఫ్ బోర్డు సభ్యుడినని గుర్తు చేశారు. తనకు తెలియకుండా కొత్త నిబంధనలు ఎలా అమలు పరుస్తారని నిలదీశారు. వెంటనే వాహనాలు విడిచి పెట్టాలని కొరారు. ఆదిలాబాద్ డీఎఫ్ఓతో కూడ ఫోన్లో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందికి గురి చేసే చర్యలు మానుకోవాలని సూచించారు. చిన్న వాహనాల అనుమతి విషయంలో తాను అటవీ శాఖ మంత్రితో, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌తో ఉదయమే మాట్లాడుతానని, ఈ అంశం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఉన్నతా స్థాయి నిర్ణయం జరిగే వరకు చిన్న వాహనాలను ఆపకూడదని సూచించారు. అధికారులపై ఎమ్మెల్యే ఒత్తిడి తీసుకోరావడంతో అధికారుల ఆదేశం మేరకు బిర్సాయిపేట రేంజ్ అధికారి అరుణ, చెక్ సిబ్బంది వాహనాలను విడిచిపెట్టారు. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఊపిరి పీల్చుకొన్నారు. అర్ధ రాత్రి చలిలో తమ కోసం వచ్చి తమకు సహాయం చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

చేతులకు సంకెళ్లు వేసుకొని ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. కాగా ఆదివారంతో వారి సమ్మె 27వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట దారిపొడవునా చేతులకు సంకెళ్లతో నిరసన తెలిపారు. ఆశావర్కర్లతో పాటు సీఆర్టీలకు న్యాయం చేసిన సీఎం తమను పట్టించుకోవడం లేదంటూ తాళ్లతో సంకెళ్లు వేసుకొని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యోగులు డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే తమను రెగ్యులర్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాము సమ్మెలో ఉండటంతో పేద విద్యార్థులకు విద్య అందడం లేదన్నారు. రెగ్యులర్ చేయడంలో ఆలస్యం అవుతుంటే అప్పటి వరకు పేస్కేల్‌ను అమలు చేయాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ధరమ్ సింగ్, వెంకటి, పార్థసారథి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాల సీఆర్టీల సమ్మె విరమణ



నవతెలంగాణ-ఉట్నూర్

గత 20 రోజుల నుంచి ఐటీడీఏ ఎదుట కొనసాగిన ఆశ్రమ పాఠశాల సీఆర్టీ ఉపాధ్యాయుల డిమాండ్‌లను పరిష్కరిస్తామని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అధికారులు హామీ ఇవ్వడంతో ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా సమ్మెని విరమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ పాఠశాల సీఆర్టీల సమస్యలను పరిష్కరిస్తూ, నెల వారీగా వేతనాలు అందించే విధంగా చూస్తుందన్నారు. సీఆర్టీ ఉపాధ్యాయులు సోమవారం నుంచి విధులకు హాజరై, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కారం చేయడానికి మన ముఖ్యమంత్రి రేవంత్ అన్న ఉన్నారన్నారు. ఈ సందర్భంగా సీఆర్టీ ఉపాధ్యాయులు సానుకూలంగా స్పందించి, సోమవారం నుంచి విధులకు హాజరవుతామన్నారు. కార్యక్రమంలో డీడీ జాదవ్ వసంతరావు, నాయకులు, సీఆర్టీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మౌనిష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారని సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మౌనిష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన నివాసం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాదాపు 300మందికి పైగా కార్మికులను శాలువాతో సత్కరించి మెమోంటోలను అందజేసి వారి సేవలను కొనియాడారు. ప్రతినిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. తన పుట్టిన రోజు వేడుకలు పారిశుధ్య కార్మికులతో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక సేవల్లో రాణించేలా తను బయటకు వచ్చినట్టు తెలిపారు. ఎలాంటి రాజకీయ ఉద్యేశంతో ఈ కార్యక్రమం నిర్వహించలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ దామోదర్‌రెడ్డి. సానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, ఆర్డి జాదవ్ కృష్ణ, ప్రేమేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు కేదారేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

జన్మదినం సందర్భంగా రక్తదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బండ శ్రీను జన్మదినాన్ని పురస్కరించుకొని తన మిత్ర బృందం స్థానిక రిమ్స్‌లో రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోర హరీష్, అజయ్, చంద్రశేఖర్‌గౌడ్, శైలేందర్, బుద్ధి శ్రీను, బండ శ్రీను రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బండ శ్రీను మాట్లాడుతూ తన ప్రతి జన్మదినం రోజున రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉంటానని, ఇది తనకు సంతోషాన్నిస్తుందని పేర్కొన్నాడు. తను 12వ సారీ రక్తదానం చేశానని పేర్కొన్నాడు. ఇలాగే అందరూ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొని, యువతకు స్ఫూర్తినివ్వాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మురారి, కుర్ర రవీందర్, చంద్రశేఖర్‌గౌడ్ సిబ్బంది రవి, తోట రాజు పాల్గొన్నారు.

అశ్రునయనాల నడుమ రొకండ్ల రమేష్ అంత్యక్రియలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీనియర్ నాయకులు రోకండ్ల రమేష్ అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ జరిగాయి. పట్టణంలోని జీఎస్ ఎస్టేట్ నుంచి అంతిమ యాత్ర ప్రారంభమైంది. స్థానిక తిర్పెల్లిలో శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. దీనికి ఎమ్మెల్యే పాయల శంకర్, మాజీ ఎమ్మెల్యే రామన్నతో పాటు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, బీఆర్ఎస్ నాయకులు గంగ్రత్ రమేష్, ప్రహ్లాద్, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అకాల మరణంపై సానుభూతి వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

వృద్ధులకు సేవలు అందించిన పక్షి ప్రేమికుడు

నవతెలంగాణ-బోథ్

జాతీయ పక్షుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ప్రముఖ పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్, తలమడుగు మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమంలో వృద్ధులకు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తోటలో పక్షుల ఆహార నిమిత్తం బర్డ్ ఫీడర్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేనేజర్ రాజు, సామాజిక కార్యకర్త కౌటిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | జనవరి 06, 2025 | www.navatelangana.com

భరోసా సెంటర్‌ను సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌ను డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సివిల్ జడ్జి యువరాజ్ సందర్శించారు. భరోసా సెంటర్, ఉద్యోగుల విధులు తెలుసుకున్నారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు, సంబంధిత సంబంధిత ఫైళ్లను తనిఖీ చేసి సూచనలు సలహాలు అందజేశారు. భరోసా కేంద్రానికి వచ్చిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి భాస్కర్, భరోసా ఉమెన్ ఎస్సై తిరుమల, లీగల్ అడ్వైజర్ శైలజ, ఏఎస్ఎం విజయలక్ష్మి రిసెప్షనిస్ట్ సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగులమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడు

నవతెలంగాణ-కౌటాల

సెల్ఫీ వీడియో తీసుకుంటు పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మండలంలోని బోదంపెల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్తానికులు తెలిపిన వివరాల ప్రకారం కర్నె వెంకటేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఒక యువతితో ప్రేమలో పడ్డాడు. వారి పెండ్లి విషయమై అమ్మాయి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో వెంకటేష్ శనివారం సాయంత్రం సెల్ఫీ వీడియో తీసుకుంటు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అతనిని వెంటనే కౌటాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈస్గాంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం. ఈ విషయంపై కౌటాల పోలీస్ అధికారులు ఎలాంటి సమాచారం అందించడం లేదు.

తెరపైకి కొత్త మండలం..!

- అనార్‌పల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్
- దూరభారం తగ్గుతుందని పలు గ్రామాల నివేదన
- ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వేడుకోలు

ఆ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లాలంటే నిత్యం అవస్థలు పడుతున్నారు. జైనూర్ మండలానికి చెందిన ఈ గ్రామాల ప్రజలు వారి మండల కేంద్రానికి వెళ్లాలంటే మరో మండల కేంద్రమైన కెరమెరికి వెళ్లాల్సి వస్తోంది. ఆ గ్రామాలకు సమీపంలోని పెద్ద పంచాయతీగా ఉన్న అనార్‌పల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క కెరమెరి మండల పరిధిలోకి వచ్చే గ్రామాలు సైతం ఈ కొత్త మండలాన్ని కోరుకోవడం ప్రత్యేకత సంతరించుకుంది. ప్రభుత్వం ఇది వరకే ఉమ్మడి కొన్నింటిని కొత్త మండలాలను ప్రకటించినా.. అనార్‌పల్లి మండలాన్ని మాత్రం విస్మరించింది. దీంతో అనేక ఏండ్ల నుంచి ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ వినిపిస్తున్నా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.



నవతెలంగాణ-కెరమెరి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్త మండలాల ఏర్పాటు అంశం మళ్లీ ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది. గత ప్రభుత్వం కొత్త జిల్లాలో ఏర్పాటు సమయంలో రెవెన్యూ డివిజన్లతో పాటు కొన్ని మండలాలను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొంత వరకు బాగానే ఉన్నప్పటికీ ప్రజల నుంచి ఎన్నికల సమయంలో డిమాండ్ పెరగడంతో మరికొన్ని రెవెన్యూ డివిజన్‌లతో పాటు కొత్త మండలాల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తమకు కొత్త మండలాలు ఏర్పాటయ్యాయని సంబరాలు కూడా చేసుకున్నారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో మండలాల ఏర్పాటుకు ప్రజల నుంచి మండలాల ఏర్పాటు కోసం డిమాండ్ ఉన్నప్పటికీ వారి కల నెరవేరకపోవడంతో నిరాశకు గురయ్యారు. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. కొత్త మండలాల ప్రస్తావన మళ్లీ తెరపైకి తీసుకురావడంతో ఇప్పటికైనా సమస్య పరిష్కారమవుతుందని ఆశతో ఉన్నారు.

మండలంలోని అనార్‌పల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వస్తుంది. మండల కేంద్రం నుండి సుమారు 8కిమీ దూరంలో ఉన్న అనార్‌పల్లిని మండలం ప్రకటిస్తే మారుమూల 20 గ్రామాలకు పాలన పరంగా సౌకర్య వంతంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనాల ప్రకారం మండల కేంద్రంగా ప్రకటించాలంటే పదివేల జనాభా ఉండాలి. అయితే ఇప్పుడు 14 జీపీలను కలుపుకుంటే 2011 జనాభా లెక్కల ప్రకారం 11వేల 800 ఉంది. అయితే గడిచిన 13 ఏండ్ల వ్యవధిలో పెరిగింది. నిబంధనాల ప్రకారం చూసిన కూడా మండల కేంద్రం ఏర్పాటుకు అనువుగా ఉంది.

చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే..!

కెరమెరి మండల కేంద్రానికి సుమారు 8కిమీ దూరంలో ఉన్న అడ్డేసర, అందుగూడ, చింతకర్ర, గ్రామాలు జైనూర్ మండల పరిధిలోకి వస్తాయి. ఈ గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం నిత్యం జైనూర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. బ్యాంకు పనులు, తహసీల్దార్, ఎంపీడీఓ, మీ సేవా, ఇలా ప్రతి పనికి జైనూర్ వెళ్లాల్సివస్తోంది. జైనూర్ వెళ్లాలంటే కెరమెరికి చేరుకోవాలి. అక్కడి నుండి 20 కిమీ దూరంలోని మండల కేంద్రానికి వెళ్లాలంటే దూర భారం తప్పడం లేదు. కెరమెరికి చేరుకోవాలన్నా ప్రయివేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దూరభారంతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. నార్నూర్ మండలంలోని మలంంగి, మాలేపూర్, ఉమ్రి తదితర గ్రామాల ప్రజలు పనుల నిమిత్తం ప్రత్యేక వాహనాలతో నార్నూర్ వెళ్లక తప్పడం లేదు. మారుమూల ప్రాంతంలో వాహన రాకపోకలు కూడా అంతంత మాత్రమే ఉండడంతో ఈ గ్రామాల ప్రజలు ఎన్నో ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాలతో పాటు కెరమెరి మండలంలోని సరిహద్దు గ్రామాలు మండలానికి సుమారు 25కిమీ దూరంలో ఉన్నాయి. పరందొలి, కోట, శంకర్ లొద్ది, ముఖద్దం గూడ, మహారాజ్ గూడా గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సౌకర్యం లేదు. దీంతో ప్రత్యేక వాహనాలతో మండలానికి చేరుకుంటున్నారు. ఇలా దూర భారం, విలువైన సమయంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకు సౌకర్య వంతంగా ఉంటుంది

రాథోడ్ శేషారావు, అన్నార్‌పల్లి మాజీ సర్పంచ్



మారుమూల గ్రామాల ప్రజలు మండల కేంద్రాలకు వివిధ పనుల నిమిత్తం అనునిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారు. జైనూర్, నార్నూర్ మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు రవాణా కష్టం తరంగా ఉంది. చిన్న పని నిమిత్తం సైతం రోజంతా గడుస్తుంది. అన్నార్ పల్లి ని మండలం గా ప్రకటిస్తే పరిసర 20గ్రామాల ప్రజలకు అన్ని విధాలా సౌకర్య వంతంగా ఉంటుంది.

అనార్‌పల్లి మండలం ఏర్పాటు చేయాలి

సాగర్, అడ్డేసర, జైనూర్ మండలం.



మండల కేంద్రానికి వెళ్లాలంటే కెరమెరి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. దీంతో సమయం వృథా అవుతుంది. సొంత వాహనాలున్నవాళ్లు వారి వాహనాల్లో వెళ్తున్నారు. మిగతా వారు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. మారుమూల గ్రామాల ప్రజలకు కష్టాలు తీరాలంటే అనార్‌పల్లిని మండలలం ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకార్యార్థంగా ఉంటుంది.

అధికారులు నివేదిక పంపించాలి

రాథోడ్ రూప్‌లాల్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు



జైనూర్, నార్నూర్, కెరమెరి, నార్నూర్ మండలాల్లోని కేంద్రానికి దూరంగా ఉన్నాయి. ఈ గ్రామాలను కలుపుకొని అనార్‌పల్లి మండలంగా ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం ప్రస్తుతం కొత్త జీపీలు, మండలాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 14 గ్రామ పంచాయతీలలో జనాభా మండల ఏర్పాటుకు అనుకూలంగా ఉంది. జిల్లా అధికారులు అనార్‌పల్లి మండలం ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక అందజేయాలి.

పత్రికలే ప్రజలు, ప్రభుత్వానికి వారధి



నవతెలంగాణ-కెరమెరి

పత్రికలే ప్రభుత్వానికి ప్రజలకు వారధి అని మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం, జడ్పీటీసీ సెడ్మకి దృపతబాయి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నవతెలంగాణ 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలికి తీయడంలో నవతెలంగాణ పత్రిక ముందు వరుసలో ఉంటుందని తెలిపారు. సమాజంలో నెలకొన్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకువచ్చేందుకు, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరవేసేందుకు పత్రికలు పని చేస్తాయన్నారు. ప్రజా సమస్యలను, ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపడమే కాకుండా అభివృద్ధి ఫలితాలను కూడా ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెందూర్ ఆనంద్ రావు, సాంగ్వి మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు, రాంచందర్, మున్ను, పోశం పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఎమ్మెల్సీ అభ్యర్థి మద్దతు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని 27 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా ఆదివారం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, రిటైర్డ్ ఆర్జేడీ ఎల్.సుహాసిని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. వారికి అండగా ఉంటామని తెలిపారు. రెగ్యులర్ చేయడానికి సమయం పడితే ఆ లోపు బేసిక్ పే ఇవ్వాలని, ప్రభుత్వం కాలయాపన చేయకుండా తక్షణం సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల అధ్యక్షుడు శృతిక, ప్రధాన కార్యదర్శి తుకారం, జిల్లా కోశాధికారి బోయిని నాగేష్, మీడియా అధికార ప్రతినిధి పవన్ కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారులు నలంద, అరుణ, మీనా, రమాదేవి పాల్గొన్నారు.

ఆదివాసుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం



నవతెలంగాణ-వాంకిడి

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని ఆదివాసుల సంక్షేమమే పోలీసుల ప్రధాన ధ్యేయమని ఎస్ఐ ప్రశాంత్ అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు వాంకిడి పోలీసుల ఆధ్వర్యంలో చొప్పన్‌గూడ గ్రామంలో 100 ఆదివాసీ కుటుంబాలకు దుప్పట్లు, రెండు క్వింటాళ్ల బియ్యాన్ని ఎస్ఐ ప్రశాంత్ పోలీస్ సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలితీవ్రతతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు ఉపయోగపడే విధంగా ఈ దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. ఎస్పీ సారథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపడుతామని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ వల్ల ప్రతి మారుమూల గిరిజన ప్రాంతాల్లో పోలీసులు అందుబాటులో ఉంటున్నారని, అపరిచిత వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో లేదా డయల్ 100కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. వివరాలు అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

అయ్యప్ప ఆలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పెద్దవాగు ఒడ్డునగల హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మణికంఠ ఫ్లెక్సీ ఆధ్వర్యంలో రూపొందించిన కాలసూచిని ఆలయ అర్చకుడు నాగేశ్వర శర్మతో పాటు గురు స్వాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు కాండ్రే కిషన్, గురు స్వాములు మోహన్, చంద్రమోహన్, శ్యామ్, రాజు, మణికంఠ ఫ్లెక్సీ నిర్వాహకుడు శ్రావణ్ పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం..!

- కమ్ముకుంటున్న పొగ మంచుతో వాహనదారుల ఇబ్బందులు
- గజగజ వణుకుతున్న వృద్ధులు..చిన్నారులు
- 8 మండలాల్లో సింగిల్ డిజిట్ నమోదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో మిగితా ప్రాంతాల కంటే జిల్లాలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జిల్లావాసులు గజగజ వణుకుతున్నారు. వృద్దులు, చిన్నారులు చలి తీవ్రతను తట్టుకోలేక అనారోగ్యానికి గురవుతున్నారు. శనివారంతో పోలిస్తే జిల్లాలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గాయి. రాష్ట్రంలో అత్యల్ప ఉష్ణోగ్రత ఆదిలాబాద్ జిల్లా అర్లి(టీ)లో 5.9 డిగ్రీలు నమోదు కాగా, రెండవ అత్యల్పం జిల్లాలోని సిర్పూర్(యు)లో 6.0 డిగ్రీలుగా నమోదైంది. నిన్నటితో పోలిస్తే మూడు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గింది. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మండలాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, గిన్నెదరి(తిర్యాణి)లో 6.1డిగ్రీలు, కెరమెరిలో 7.3డిగ్రీలు, వాంకిడిలో 7.6డిగ్రీలు, రవీంద్రనగర్(చింతలమానేపల్లి)లో 8 డిగ్రీలు, కాగజ్‌నగర్‌లో 9.3 డిగ్రీలు, బెజ్జూర్‌లో 9.7 డిగ్రీలు, రెబ్బెన జైనూర్‌లో 10 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏజెన్సీ ప్రాంతాలు చలికి వణికి పోతుండగా అధికారులు ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దష్టి కేంద్రీకరించారు. ఉష్ణోగ్రతలు తగ్గుదలతో వచ్చే వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. జిల్లావ్యాప్తంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు చలి గాలుల తీవ్రత పెరిగింది. ఉదయం పూట రహదారులపై పొగ మంచు కప్పుకొని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శీతాకాలంలో జిల్లాలో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు చలికి వణికి పోతున్నారు. ప్రభుత్వ హాస్టల్లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసినప్పటికీ పూర్తిస్థాయిలో సరిపోవడం లేదు. కొన్ని హాస్టళ్లలో భవనాలు సరిగ్గా లేకపోవడంతో రాత్రిపూట వీచే ఈదురుగాలులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా హాస్టళ్ల వార్డెన్లు కొన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యవంతంగా ఉండడం లేదని తెలుస్తోంది.

బాలల రక్షణకు సమన్వయంతో పని చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలల రక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. బాలల లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపులో జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల రక్షణ కోసం చట్టంలో అనేక అంశాలు క్రోడీకరించబడి ఉన్నాయన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు బాల్య వివాహాల నిర్మూలన కృషి చేయాలన్నారు. దీని కోసం విద్యాభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. రెండు రోజుల పాటు ఇచ్చిన శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, అడ్వకేట్ వెంకటేశ్వర్లు, ఎల్‌సీపీఓ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌టీఏ నాన్ ఆఫిషియల్ సభ్యునిగా రమేష్

నవతెలంగాణ-రెబ్బెన

మండలం సింగల్ గూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసినందుకు గుర్తింపుగా మండల అధ్యక్షుడు లావుడ్య రమేష్‌ను ఆర్‌టీఏ(రిజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ) నాన్ ఆఫిషియల్ సభ్యునిగా నియమించారు. నామినేట్ అయిన సందర్భంగా ఆయనను డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు శాలువ కప్పి సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించిన తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసారి సీతక్క, డీసీసీ అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. అనంత శ్రీ విభుషిత్ రామానంద చార్య పాదుకదర్శన కార్యక్రమం కరపత్రాలను ఆదివారం తన నివాసంలో నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ సమీపంలో ఈ నెల 17న పాదుక దర్శన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కలియుగంలో మానవాళిని ఆధ్యాత్మికత వైపు మళ్లించేందుకు స్వామి నరేంద్ర చార్య మహారాజ్, కానీఫ్ నాథ్ మహారాజ్ రామానంద చార్య బోధనలను ప్రజలకు వివరిస్తూ సమాజ హితం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో దిలీప్ గాయక్వాడ్, బాలాజీ, పండరి చాప్లె, నిరక్షక్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కాంగ్రెస్ పార్టీలో ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని తిర్యాణి, వాంకిడి, కెరమెరి, సిర్పూర్-యు, లింగాపూర్, జైనూర్ మండలాల నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుల ఆధ్వర్యంలో చేరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే తమ లక్ష్యం అన్నారు. మొదటి సంవత్సరంలోనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుచేసి చూపించమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు వివరించారు. పార్టీలో చేరిన వారిలో కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు తారిక్, సిర్పూర్-యు మాజీ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, సర్పంచులు భూపతి, నీలాబాయి, ప్రకాష్, జైనూర్ వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌తో పాటు 150 మంది వరకు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, జిల్లా యూత్ అధ్యక్షుడు గుండా శ్యామ్, జిల్లా నాయకులు అనిల్ గౌడ్, మునీర్, శంకర్ పాల్గొన్నారు.

నేడు సింగరేణి కార్మికులతో ఎమ్మెల్సీ సమావేశం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలోని బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఉద్యోగులతో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమావేశం నిర్వహించనున్నారు. సింగరేణి కార్మికులకు కేసీఆర్ నాయకత్వంలో అందించిన సంక్షేమ పథకాల అమలు తీరు, గత ఎన్నికలలో ప్రభుత్వం, గుర్తింపు సంఘం ఇచ్చిన హామీల అమలు, ఇతర సమస్యలపై కార్మికులతో చర్చించనున్నారు. ఎమ్మెల్సీతో పాటు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్, టీబీజీకేఎస్, నాయకులు పాల్గొనున్నారు. కార్మికులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ నాయకులు కోరారు. బీఆర్ఎస్ హయంలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై ఎమ్మెల్సీ మాట్లాడుతారని తెలిపారు.

'సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైంది'

- లక్షట్‌పేట కోర్టు జడ్జీ అసాదుల్లా షరీఫ్



నవతెలంగాణ-జన్నారం

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని లక్షెట్టిపేట కోర్టు జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో పీఆర్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు చైతన్యం తీసుకువస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా, మండల అధ్యక్షులు కొట్టే శంకర్, కట్ట రాజమౌళీ, ఎంతఊ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తాండూర్



వాసవి క్లబ్ తాండూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకోవడం జరిగినది. వాసవి క్లబ్ తాండూర్ నూతన అధ్యక్షులుగా మైలారపు మధుసూదన్, కార్యదర్శిగా కాసనగొట్టు మనికృష్ణ, కోశాధికారిగా రాచకొండ మహేష్‌లను ఎన్నుకున్నట్లు వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ గోల్డెన్ స్టార్ కేసీజీఎఫ్ కేశెట్టి సంతోష్ కుమార్ తెలిపారు. ఆదివారం మంథని కేంద్రంలోని నర్సింహ శివకిరణ్ గార్డెన్స్‌లో జరిగిన వాసవి క్లబ్స్ 107 ఏ జిల్లా ప్రమాణ స్వీకారంలో భాగంగా తాండూర్ మండల కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ వాసవి క్లబ్ అడ్మినిస్ట్రేషన్ ప్రధాన కార్యదర్శి గార్లపాటి శ్రీనివాస్, జిల్లా గవర్నర్ ఇల్లందుల కిషోర్, కోశాధికారి వేణుగోపాల్, జిల్లా జాయింట్ సెక్రెటరీ శ్రీకాంత్ జిల్లా నాయకులు కాసం భాస్కర్, మైలరపు అక్షయ, తరుణి పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న స్లేట్ విద్యాసంస్థల చైర్మన్



నవతెలంగాణ-జన్నారం

మండల లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ప్రస్తుత రీజియన్ చైర్పర్సన్ స్లేట్స్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి మేరీల్యాండ్ స్టేట్ యూనివర్సిటీ(యూఎస్ఏ) ద్వారా గౌరవ డాక్టరేట్ (పీహెచ్‌డీ) బిజినెస్ మేనేజ్‌మెంట్, సోషల్ వర్క్‌లో స్వర్ణ పతకం అందుకున్నారు. ఈ గౌరవం ఆయన విద్య, సామాజిక సేవ, యువత అభివృద్ధి కోసం చేసిన విశేష కృషికి గుర్తింపు. ఆయన పిల్లలు, యువతకు విలువలు నేర్పడం, మంచినడవడికని అలవాటు చేయడం ద్వారా సమాజం మీద తనదైన ముద్ర వేశారు. అంతేకాక, సాధన, సంస్కారం పేరిట ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నిర్వహణాధికారులకు తెలంగాణ వ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి సమాజాన్ని మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషించారు. ఈ గౌరవ డాక్టరేట్ ఆదివారం ఇండియా హాబిటాట్ సెంటర్, లోధి రోడ్, న్యూ ఢిల్లీలో జరిగిన కాన్వొకేషన్‌లో చీఫ్ గెస్ట్ జస్టిస్ జేడు ఖాన్, ఫార్మర్ జడ్జ్, అలహాబాద్ చేతుల మీద తీసుకున్నారు. ఈ సందర్భంగా లయన్ శ్రీకాంత్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ, 'ఈ గౌరవం నన్ను సమాజానికి మరింత సేవ చేయడానికి, యువతలో విలువలు పెంచేందుకు, మెరుగైన భవిష్యత్తు నిర్మించేందుకు ప్రేరేపిస్తోందని అన్నారు.

పోలీస్, న్యాయశాఖ మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ఏఎంసీ గ్రౌండ్‌లో ఆదివారం జ్యుడీషియల్ , పోలీసు శాఖ మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఈ క్రికెట్ మ్యాచ్‌లో బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ముఖేష్, జ్యుడిషియల్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించగా బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ పోలీస్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. జ్యుడీషియల్ టీమ్‌లో అడ్వకేట్‌లు చిప్ప మనోహర్, చెన్ను రవి, మాదారి రాకేష్, అనిల్, సుధాకర్, రాజు, జుబైర్, సందీప్, అహ్మద్, సతీష్, రాజేష్, ఆదిత్య పాల్గొన్నారు. పోలీసు టీమ్ తరపున దేవయ్య ఇన్స్‌పెక్టర్ బెల్లంపల్లి-1 టౌన్, అఫ్జలుద్దీన్ సీఐ కుమారస్వామి పాల్గొన్నారు. ఈ మ్యాచ్‌లో పోలీసు జట్టు విజయం సాధించింది. బెల్లంపల్లి సివిల్ జడ్జి ముఖేష్ పోలీసు టీమ్‌ను అభినందించి ట్రోఫీని అందించారు.

కవ్వాల్ అడవుల్లో బర్డ్ వాచ్



నవతెలంగాణ-జన్నారం

మండలం ఇంధన్‌పల్లి రేంజి కవ్వాల్ అడవుల్లో ఆదివారం ఉదయం నిర్వహించిన బర్డ్ వాచ్ కార్యక్రమం విజయవంతం అయిందని ఎస్ఆర్ఓటి కారం శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి పక్షి ప్రేమికులు వచ్చి, వారి కెమెరాల్లో రంగురంగుల పక్షులను బంధించుకున్నారు. వచ్చిన పక్షి ప్రేమికులకు అడవిలోకి వెళ్లడానికి అన్ని రకాల సదుపాయాలు చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారులు రవి, హనుమంత్‌రావు, బీట్ అధికారులు బేస్ క్యాంపు సిబ్బంది పక్షి ప్రేమికులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రాజ్ కుమార్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-6 కొత్త రోడ్ ప్రజా సేవా ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కుమ్మరి రాజ్ కుమార్ నియమితుడయ్యాడు. ఆదివారం ఆటో కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన ఎనన్నికలలో 92 ఓట్లకు గాను 32 మెజారిటీ ఓట్లతో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిస్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చిలుక మల్లేష్ పాల్గొన్నారు.

టైగర్ జోన్‌ను వెంటనే రద్దు చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం

నవతెలంగాణ-జన్నారం

టైగర్ జోన్‌ను వెంటనే రద్దు చేసి స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకీ ఫారెస్ట్ అధికారుల ఆగడాలు ఎక్కువైతున్నాయని, ఫారెస్ట్ అధికారుల బెదిరింపులకు అడ్డుకట్ట వేయాల్సిందిగా ఎంపీని కోరారు. టైగర్‌జోన్ పరిధిలోని రాకపోకల మీద ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. అడవిలోకి వెదురు సేకరణ కోసం అనుమతి ఇవ్వాలని వెదురు ఉత్పత్తుల మీద నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని కోరారు. ఈ సమస్యల మీద పార్లమెంట్‌లో చర్చించవలసిందిగా కోరారు. దీనికి ఎంపీ కూడా సానుకూలంగా స్పందించారు. టైగర్ జోన్‌పై పార్లమెంటులో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చినట్లు ప్రభంజనం తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించాలి

నవతెలంగాణ-జన్నారం

ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండకూరి రాజు అన్నారు. ఆదివారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. శాసనమండలిలో ఎస్సీ వర్గీకరణ కోసం తమ గొంతును వినిపించి మాదిగలకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకులు మరుమంగుల మల్లేష్ రాష్ట్ర అధ్యక్షుడు మొండి కత్తి లింగన్న, గౌరవ అధ్యక్షుడు కందుల సాయినాథ్ పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

- కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సమూచిత స్థానం కల్పిస్తాం
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

నవతెలంగాణ-జన్నారం

నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు మేలు చేసే విధంగా పనిచేయాలని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. అన్ని వర్గాలకు మేలు చేకూరేలా పాలకవర్గాన్ని నియమించడం జరిగిందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతన్నలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీలో ఉన్న ప్రతి కార్యకర్త జనం మెచ్చే నాయకుడిగా ఎదగాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అమ్ముడుపోయే తత్వం తనది కాదని, ప్రజాసేవె తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరికీ సమన్యాయం చేస్తామన్నారు. టైగర్ జోన్‌లో రాత్రి వేళలో అటవి ప్రాంతంలో వాహనాల అనుమతి రద్దు చేస్తూ ఫారెస్ట్ అధికారులు తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ





ఫారెస్ట్ అధికారులు వాహనాల రాకపోకలపై అనుమతి రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు. తాను రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు మెంబర్ అని, తనకు ఎలాంటి సమాచారం లేకుండా ఫారెస్ట్ అధికారులు వాహనాల అనుమతులు రద్దెలా చేస్తారో చెప్పాలన్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఆంక్షలను విధించడం సరికాదని, దీని మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. చిన్న వాహనాల అనుమతిపై సీఎం రేవంత్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారమయ్యేలా మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జన్నారం మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

జాన్నారం మండలం మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సభ్యులను మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆదివారం జిల్లా అధికారి షాబుద్దీన్ ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మీ నారాయణ, వైస్ చైర్మన్ మండల పొన్కల్‌కు చెందిన సయ్యద్ ఫసిఉల్ల, సభ్యులుగా ఎల్ల లావణ్య, లకవత్ తిరుపతి, పూసం సోనేరావ్, పులిషెట్టి లావణ్య అంబడిపల్లి నర్సయ్య, రేగుంట ప్రదీప్, ముత్యం రాజన్న, బెడద సత్తయ్య, గర్వదుల సత్యగౌడ్, బెనవేని రాజన్నలను ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పాల్గొని చైర్మన్ వైస్ చైర్మన్ పాలకవర్గ సభ్యులకు పలు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

- ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు పేరం రమేష్

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతుందని ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పేరం రమేష్ అన్నారు. ఆదివారం జైపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గత సంవత్సర కాలంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఎస్టీపీపీ యాజమాన్యంతో పాటు ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీ దృష్టికి కార్మికుల సమస్యలు తీసుకెళ్లడంతో పాటు పరిష్కారమార్గం చూపించినట్లు తెలిపారు. అయినప్పటికీ సింగరేణి యాజమాన్యం మొద్దు నిద్రతో కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేస్తుండటం బాధాకరమని అన్నారు. ఎస్టీపీపీ అవసరాల కోసం భూములు దారాదత్తం చేసినటువంటి వారు ఉపాధి నష్టపోయి కూలీలుగా మారిన వారి కోసం పోరాటం చేస్తున్న తీరు కార్మికులకు తెల్సిందేనని అన్నారు. ఎస్టీపీపీలో క్యాంటీన్ ఏర్పాటు విషయంలో కార్మిక సంఘాలకు తెలియకుండా ప్రారంభించడం బాధాకరమని, గుట్టు చప్పుడు కాకుండా ఒకరిద్దరితో క్యాంటీన్ ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు ఎలుక రమేష్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రావన్‌కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శి మద్దుల రాజిరెడ్డి, కోశాధికారి గోనె నరేష్, ప్రచార కార్యదర్శి గూడ మనోజ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం పట్టణ కమిటీ రద్దు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

అంబేద్కర్ యువజన సంఘం నియమ నిబంధనలు అతిక్రమించినందుకు పట్టణ కమిటీని రద్దు చేసినట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు ముల్కల రాందాస్, ప్రధాన కార్యదర్శి భైరం రవి తెలిపారు. ఆదివారం పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సంఘం సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత కొన్ని నెలలుగా పట్టణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తమ పరిధిని విస్మరించి ప్రవర్తించడం బాధాకరమన్నారు. పలుమార్లు ఇప్పటికే నియమ నిబంధనలు పాటించాలని హెచ్చరించినప్పటికీ తమ విధానాలు మార్చుకోక పోవడంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో కమిటీని రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. పట్టణ కమిటీని గతంలో ఏర్పాటు చేసిన క్రమంలోనే నిబంధనల మేరకు పని చేయాలని, అంబేద్కరిజంను కాపాడాలని వారికి స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. హద్దులు దాటి సీనియర్స్‌కు విలువ లేకుండా చేయడం, కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసమే వ్యవహరించడంతో పట్టణ కమిటీని రద్దు చేసినట్లు వివరించారు. అంతేకాకుండా త్వరలోనే మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును కలిసి అసంపూర్తిగా ఉన్నటువంటి అంబేద్కర్ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి సహకరించాలని కోరనున్నట్లు తెలిపారు. అదే విధంగా రాబోయే రోజుల్లో సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల కోసం ఉచిత శిక్షణను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రచిస్తున్నామన్నారు. అంబేద్కర్ యువజన సంఘం కోసం అధికారిక వాట్సాప్ గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రద్దు చేసిన పట్టణ కమిటీలోని సభ్యులను వెసులుబాటును బట్టి మండల కమిటీలోకి తీసుకుంటామన్నారు. ఇకపై ఎవరైనా ఉద్దేశపూర్వకంగా సంఘం నియమ నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పాత విధానంలోనే మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ సభ్యులందరూ సమిష్టిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు శనిగారపు లింగన్న, చిప్పకుర్తి నారాయణ, అవునూరి లచ్చన్న, మాజీ మండలాధ్యక్షుడు దొంత నర్సయ్య, అసాది పురుషోత్తం, బిరుదుల ధర్మయ్య, లింగంపల్లి వెంకటేష్, చొప్పదండి రమేష్, గరిసే రవీందర్, పెండెం సత్తన్న, మినుముల జనార్దన్, చుంచు రమేష్, కలాల రమేష్, గొడిశెల రవీందర్, మంచాల రాయలింగు, ముల్కల రంజిత్, బండి శ్రీనివాస్, గోడిశెల రాజేష్, సురమళ్ళ ఏసన్న, గుత్తికొండ శ్రీధర్, మామిడి సందీప్,కోడి ప్రేమానందం, మినుముల శాంతి కుమార్, చాతరాజు రమేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి కుమార్, బోనగిరి మహేష్, లింగంపెల్లి తిరుపతి, వేముల ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు.

హెడ్మాస్టర్‌తో కాళ్ళు పట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల



డిసెంబర్ 21న రంగారెడ్డి జిల్లా తుక్కు గూడ ప్రభుత్వ పాటశాల హెడ్ మాస్టర్ రాములుతో విద్యార్థుల కాళ్ల మొక్కించడం హీనమైన చర్య అని అలాంటి పనికి కారణం అయిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మంచిర్యాలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వక హాల్‌లో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కే మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ విద్య బుద్ధులు చెప్పే ఉపాధ్యాయుడిపై దాడి చేసి విద్యార్థుల కాళ్ళు మొక్కించారని, విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయుడిపై దాడి చేసిన ఎంతటి వారిపై అయిన చర్యలు తీసుకోవాలని, దాడి జరిగి 15 రోజులు గడిచిన ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని సీసీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టి దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజ వేణు, సామజిక న్యాయ వేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, సామజిక కార్యకర్త భీమ్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, దేవి సత్యం, పాయిరాల రాములు కనకరాజు జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు ప్రజా సంఘల నాయకులు పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమ సమితి గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండలంకలోని బాదంపల్లి గ్రామ గల్ఫ్ సంక్షేమ సమితి కమిటీని ఆదివారం గల్ఫ్ సంక్షేమ సమితి గ్రామ కమిటీని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాశెట్టి తిరుపతి, సభ్యులు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు సీపిరిశెట్టి చందు, ఉపాధ్యక్షుడు సదల రాజేష్, కార్యదర్శి దోమకొండ గంగాధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బెడదా వెంకటేష్, కోశాధికారి తాటికొండ వెంకటరమణ, స్పీకర్ తాటికొండ భోజరం, అధికార ప్రతినిధి పెంచాల రాజు, ప్రచార కార్యదర్శిలు కటకం నరేష్, సామల ప్రశాంత్, అడ్మిన్ గుడెప్పు రాజు, సలహాదారులు దూడ రవి, వేముల లచ్చన్నలకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ గల్ఫ్ కార్మికులకు అండగా నిలవాలని కోరారు.

ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఆటగాళ్ల వేలం

నవతెలంగాణ-కాసిపేట

మండల ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ లీగ్ సంబంధించి క్రికెట్ ఆటగాళ్ల వేలం పాటను ఆదివారం నిర్వహించారు. మందమర్రి ఎల్లందు క్లబ్‌లో నిర్వహించిన కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ టోర్నీ క్రికెట్ ఆటగాళ్ల మెగా వేలం పాటలో ప్రాంచైజ్ నిర్వాహకులు పాల్గొని పోటాపోటీ పడి తమకు నచ్చిన ఆటగాళ్లను తమ జట్టుకు సొంతం చేసుకున్నారు. ఈ క్రికెట్ లీగ్‌లో మొత్తం 10 ప్రాంచైజ్లు ముంబాయి హీరోస్, పల్లంగూడ టైటాన్స్, సోల్జర్స్ బ్రేవ్ హార్టెడ్, రాయల్ ఛాలెంజర్స్ ప్లే బోల్డ్, సన్ రైజర్స్, స్టర్డ్ కూల్, పవర్ హిట్టర్స్, గోవా సూపర్ కింగ్స్, సీఎస్కే, మాస్టర్స్ బ్లాస్టర్స్ ఉన్నాయి. మొత్తం పది ప్రాంచైజ్లు తమ జట్లకు ఆటగాళ్లను వేలంలో గెలుచుకోగా జనవరి 19న ప్రారంభమయ్యే కాసిపేట మండల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో ఈ జట్లు తలబడనున్నట్లు లీగ్ నిర్వాహణ కమిటీ సభ్యులు తెలిపారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం




నవతెలంగాణ-జన్నారం

ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర గ్రూప్స్ మెడి లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని వారు మాట్లాడారు. పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని వారన్నారు. రాఘవేంద్ర గ్రూప్ వారు స్కూల్లో కళాశాలలు ఏర్పాటు చేసి విద్యారంగాన్ని ఉచిత వైద్య శిబిరాలు పెడుతూ పేద ప్రజలను ఆదుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రాఘవేంద్ర గ్రూప్ ఆఫ్ చైర్మన్ మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌ను అభినందించారు. ఈ మెగా ఉచిత వైద్య శిబిరంలో చర్మ వ్యాధులు, గుండె జబ్బులు గైనకాలజిస్ట్ వివిధ రకాలైన వ్యాదులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు గోలీలను అందించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ హాండ్స్ పాఠశాల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, ఎర్ర నరేష్, ఎర్ర మహేష్, డాక్టర్లు కుమారస్వామి, డాక్టర్ చేతన్ చౌహన్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికులను వేదింపులకు గురి చేస్తే సహించేది లేదు

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

నవతెలంగాణ-జైపూర్



జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీ యాజమాన్యం కార్మికులను వేదింపులకు గురి చేస్తున్నట్లు హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మిక సంఘాల నాయకులు కార్మికులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం సర్వ సాదారాణమన్న విషయాన్ని గమనించకుండా వేదింపులకు గురి చేస్తుండటం బాధాకరమని తెలిపారు. నిష్ణాతులైన ఇంజనీర్లు సంస్థలో ఉన్నప్పటికీ సింగరేణి యాజమాన్యం ప్రయివేటు కంపెనీ అయినటువంటి పవర్‌మేక్ కంపెనికి నిర్వాహణ బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. కంపెనీ కార్మికులను ఇబ్బందులు పెడుతున్న తీరుపై సింగరేణి యాజమాన్యం స్పందించాలని డిమాండ్ చేసిన ఆయన వేదింపులకు పాల్పడుతన్న పవర్‌మేక్ కంపెనీ యాజమాన్యం తీరు మారాలని కోరారు. ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ ఈ విషయంలో స్పందించి పవర్‌మేక్ కంపెనీ వారి బెదిరింపు చర్యలు మానుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులతో సఖ్యతగా ఉన్నప్పుడే ఆశించిన మేరకు ఫలితాన్ని పొందగలమని అంతిమంగ సింగరేణి సంస్థకు లాభం చేకూరుతుందని గుర్తు చేశారు.

క్రికెట్ అకాడమీలో శిక్షణ ప్రారంభం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మురళీ మెమోరియల్ క్రికెట్ అకాడమీ మొదటి బ్యాచ్ శిక్షణను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ బ్యాచ్‌లో 15 మంది శిక్షణ పొందడానికి చేరారు. ఈ సందర్భంగా సీసీపీ రవికుమార్ మాట్లాడుతూ క్రికెట్ అకాడమీ వల్ల క్రీడాకారులు మరింత రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. మొదటి బ్యాచ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. క్రికెట్ అకాడమికీ తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత శ్రీధర్, టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ స్వామి, లయన్స్ క్లబ్ సభ్యుడు రాజమల్లు, అకాడమీ కోఆర్డినేటర్ అల్లం వెంకటేశ్వర్లు, ఒకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేష్, అకాడమీ సభ్యులు పైడిమల్ల నర్సింగ్, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | జనవరి 06, 2025 | www.navatelangana.com

రాయిసెంటర్ అభివృద్ధికి కృషి చేస్తాం

నవతెలంగాణ-బోథ్



రాయిసెంటర్ అభివృద్ధికి కృషి చేస్తామని ఆదివాసీ నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని పార్డి(బి) రాయిసెంటర్‌లోని అభివృద్ధిపై సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో పూలే వెల్ఫేర్ సొసైటీ సొనాల మండల నాయకులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలే సంఘం అధ్యక్షుడు గాజుల పోతన్న మాట్లాడుతూ ఆదివాసుల సమస్యలను సాధించుటలో, సామాజిక సేవలో మేము మీకు తోడు ఉంటామని అన్నారు. గ్రామంలోని సమస్యలను పైఅధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తామని అన్నారు. ఈ సమావేశానికి మండలంలోని 18 గ్రామాల్లో ఆదివాసీ నాయకులు లక్ష్మణ్, లాలురామ్, గంగారాం, జైతు పటేల్, స్వామి, సుందన్న, మారుతి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి గాను పాఠశాలలో చేరేందుకు నేటి నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎస్టీ ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు గాను రూ.125, ఇతరులకు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు. ఏప్రిల్ 3న హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆరవ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అడ్మిషన్ టెస్ట్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాంఘిక శాస్త్రం పరీక్షలో జిల్లా ద్వితీయస్థానం సాధించిన పిట్లం విద్యార్థి

నవతెలంగాణ-పిట్లం

తెలంగాణ సాంఘిక శాస్త్ర జిల్లా ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షలలో మండల కేంద్రానికి చెందిన పదవ తరగతి విద్యార్థి శ్రీకాంత్‌రెడ్డి ద్వితీయ స్థానంతో మెమోంటో, మెరిట్ సర్టిఫికెట్ కైవసం చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రతిభ గుర్తించడానికి క్రీడలతో పాటు విద్యనభ్యసిస్తున్న సబ్జెక్టుల వారీగా వారి ప్రతిభను వెలికితీయాలనే సదుద్దేశ్యంతో జనవరి 4న జిల్లా కేంద్రంలోని ఆర్కె కళాశాలలో తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు పాల్గొన్నారు. సాంఘిక శాస్త్రం పోటీ పరీక్షలకు గానూ 25 మండలాలకు చెందిన 65 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనగా.. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శ్రీకాంత్‌రెడ్డి రెండవ స్థానాన్ని సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో దీంతో సాంఘిక శాస్త్రం ఫోరం బాధ్యులు ఆయనను అభినందించి మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు ప్రసన్ కుమార్, బాల్‌రాజ్, రాజశేఖర్ రావు, కళాశాల సీఈఓ జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే పనులతో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో నేషనల్ హైవేకు సంబంధించి ట్రాన్స్‌కో పనులు ఆదివారం నిర్వహించగా 6 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు వినియోగదారులకు సమాచారం ఇవ్వకపోవడంతో వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏకంగా 6 గంటలపాటు అంతరాయం ఏర్పడడంతో వ్యాపారం స్తంభించిపోయింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల పరిధిలోని చందూర్ గ్రామంలోని జిల్లా ప్రభుత్వ పాఠశాల 1990-91 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 34 ఏండ్ల తరువాత ఒక చోట కలుసుకున్నారు. తమ ఉద్యోగం, హోదాను మరిచిపోయి చిన్నపిల్లల కేరింతలతో యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం కోలహలంగా మారిపోయింది. ఈ సమ్మేళనంలో గురువులను పుష్ప గుచ్చాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువులతో ఈనాడు ఈ స్థాయిలో ఉన్నామని తెలిపారు. చదివిన బడి, పరిసరాలను చూసి ఆనంద పడ్డారు. గురువుల దండనలు తలుచుకుంటూ సాగిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు ఆటలు, పాటలు అలరించాయి. వచ్చిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో పొద్దుపోయే వరకు గడిపి బరువెక్కిన హృదయాలతో ఎవరి గమ్య స్థానాలకు వారు కదిలారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు మదూరి, మాధవరెడ్డి, షేక్ జమాల్, శేషుగారి రఘుపతి, జగ్గారి శేఖర్‌రెడ్డి, రాజశేఖర్, పొతరెడ్డి, కండక్టర్ సాయిలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని బేగంపూర్ చౌరస్తా వద్ద ఆదివారం ఏఎస్ఐ రాములు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని తెలిపారు. రోడ్డు నిబంధనలపై ప్రతిఒక్కరికీ అవగాహన పెంపొందించడం కోసమే ప్రతి ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసు, రవాణా శాఖాధికారులు సంయుక్తంగా హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైవే యాక్సిడెంట్ మేనేజర్ సౌర ప్రతాప్, పోలీస్ సిబ్బంది సాయిశివ తదితరులు పాల్గొన్నారు.

తాండ బూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పెద్ద గుజ్జుల్ తండా భారతీయ జనతా పార్టీ బూత్ నెంబర్ 6 కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గిరిజన మోర్చా జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ కాట్రోత్ రవి నాయక్ ఆదివారం తెలిపారు. బూత్ అధ్యక్షులుగా కాట్రోత్ పండరి నాయక్, ఉపాధ్యక్షులుగా నేనావత్ రామారావు, కార్యదర్శిగా బాధావత్ సుమన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గాంధారి మండల నాయకులు బాదావత్ రమేష్, సుమన్, లకావత్ సుమన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మినీ ట్యాంక్ బహూకరణ

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని క్రీడాకారుల నీటి సౌకర్యం కోసం మినీ ట్యాంక్ బహుకరించినట్టు నేతాజీ యూత్ అధ్యక్షులు పంబల సతీష్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని కబడ్డీ వాలీబాల్ తదితర క్రీడాకారులు నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండడం గమనించి స్థానిక ఉపాధ్యాయులు రామ గోనేల, రాజాగౌడ్ 15వేల విలువ గల మినీ ట్యాంక్ బహుకరించారని దీంతో క్రీడాకారుల నీటి సమస్య తీరుతుందన్నారు. మున్ముందు మరిన్ని సహకారాలు యువతకు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జి.చందు, ఎం.రాము, అస్లాం, క్రీడాకారులు తదితరులున్నారు.

రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడపొద్దు

నవతెలంగాణ-నిజాంసాగర్

రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడపవద్దని నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ ఆదివారం తెలిపారు. ప్రజల రవాణా సౌకర్యార్థం ప్రభుత్వం కోట్లు వెచ్చించి తారు రోడ్లను నిర్మిస్తుందని, ఆ రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడపడంతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని ఆయన అన్నారు. మండలంలోని ట్రాక్టర్ల యజమానులు నిబంధనలు పాటిస్తూ దమ్ము చక్రాలకు పట్టీలను బిగించి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. అలానే దమ్ము చక్రాలతో రోడ్లపైకి వస్తే ఆ ట్రాక్టర్ యాజమానులపై కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

- కాంగ్రెస్ మండల నాయకులు

నవతెలంగాణ-ముధోల్



మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, ముధోల్ మాజీ ఎంపీపీ ఎజాజ్‌ఉద్దీన్, కాంగ్రెస్ మండల నాయకులు సురేందర్‌రెడ్డి, పోతన్న యాదవ్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ముధోల్ నియోజకవర్గ కేంద్రాన్ని అభివృద్ధి చేయలేదని, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఒకే పార్టీలో ఉంటూ విమర్శించుకోవడంతో కాంగ్రెస్ స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకుముందు ఉన్న బీటీ రోడ్డుపై సీసీ రోడ్డు 700 మీటర్లు వేసేయగానే ముధోల్ అభివృద్ధి జరిగిపోయిందా అని ప్రశ్నించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హయాంలో రూ.3కోట్లతో ముధోల్‌లోని ప్రతి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణం, పశు పతినాథ్ ఆలయం, ముక్తాదేవి ఆలయం, మార్కండేయ ఆలయాల నిర్మాణానికి రూ.64లక్షల నిధులు మంజూరు చేయించారని వారు గుర్తుచేశారు. 30 పడకల నూతన ఆస్పత్రి నిర్మాణానికి రూ.8కోట్ల నిధులు మంజూరు, మండల పరిషత్ కార్యాలయ నిర్మాణానికి రూ.1కోటి నిధులతో నూతనంగా నిర్మించామని తెలిపారు. ముధోల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నిర్మాణానికి రూ.1కోటి నిధులతో నిర్మించారని అన్నారు. అలాగే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల కళాశాల నిర్మాణానికి రూ.9కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. మార్కెట్ కమిటీ గోదాం నిర్మాణానికి రూ.4 కోట్లు, మన ఊరు మనబడి ద్వారా రూ.1.10 కోట్ల నిధులు, కేజీబీవీ అదనపు భవన నిర్మాణానికి రూ.2.30 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా మూడు చెరువుల పునరుద్ధరణకు రూ.80 లక్షలు, రైతు వేదిక నిర్మాణానికి రూ.20లక్షలు, షాదిఖానా నిర్మాణానికి రూ.50లక్షలు, ముధోల్ నుంచి తానూర్ వరకు డబుల్ రోడ్డు, ముధోల్ నుంచి ఎల్వతు వరకు బీటీ రోడ్డు మంజూరు, బస్టాండు చౌరస్తా నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం, ఎంజెపీ బీసీ రెసిడెన్షియల్, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల కళాశాల మంజూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేశామని తెలిపారు. మున్నూరు కాపు సంఘం, ముదిరాజ్ సంఘం, రజక సంఘం, యాదవ సంఘం, ఎస్సీ కమ్యూనిటీ, మైనార్టీ కమ్యూనిటీ హాల్స్‌కి మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నిధులు మంజూరు చేశారన్నారు. పంట చేనులోనికి గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుతో పాటు జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణానికి ప్లాట్లు గతంలో పంపిణీ చేశామని అన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి స్థలం మంజూరు చేశామన్నారు. పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి హయాంలో అభివృద్ధి పనులు జరిగాయని వారు స్పష్టం చేశారు. పలు అభివృద్ధి పనులు నేటికి కొనసాగుతున్నయని వారు తెలిపారు. పనులు చేయించిన వారిని చేయలేదని విమర్శించడం తగదన్నారు.మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌కు అపార అనుభవం ఉండీ, సీనియర్ నాయకులు అయిన మీరు మాట్లాడే ముందు తెలుసుకుని మాట్లాడాలని వారు హితవు పలికారు. ఒకే పార్టీలో ఉండి ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం మంచి సాంప్రదాయం కాదన్నారు. కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, నాయకులు రాంరెడ్డి, ఆకుల శ్రీనివాస్ గౌడ్, షమీమ్, మంత్రివార్ బాబు, కాంతారావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



నవతెలంగాణ-తలమడుగు

టీపీసీసీ హోదాలో పనిచేసిన అప్పటి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఏర్పాటు చేసిన జెండా పండుగ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముదిరాజులను బీసీ(డి) నుంచి బీసీ(ఎ)లోకి మారుస్తానని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ముదిరాజ్ గ్రామపెద్ద రామన్న జెండాను ఆవిష్కరించి, దివంగత బైండ్ల గణపతి స్మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ముదిరాజులను బీసీ(డి) నుంచి బీసీ(ఎ)లకు మార్చడంతో పాటు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రివర్గంలో స్థానం, నీలం మధు ముదిరాజ్‌కు ప్రభుత్వంలో ప్రత్యేక గుర్తింపు కోసం ఎమ్మెల్సీ లేదా ఇతర పదవులను కట్టబెట్టాలని కోరారు. ముదిరాజులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ ఉద్యోగుల సంఘం విభాగం నాయకులు మోతే శ్రీనివా స్, బైండ్ల రామన్న, బైండ్ల సుభాష్, గోనెల గంగన్న, బొజ్జ మోహన్, బైండ్ల రమాకాంత్, బొజ్జ మచ్చేందర్, ఎలవేణి కృష్ణ, దర్శనాల నర్సిములు, బొజ్జ బాలాజీ, బొజ్జ పండరి, లక్ష్మణ్, రామన్న, హనుమాన్లు పాల్గొన్నారు.

ఘనంగా డా.ప్రసన్న హరికృష్ణ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఇచ్చోడ



రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న హరికృష్ణ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించడానికి పట్టభద్రుల ఓటర్లు కృషి చేయాలని బలరాం జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రసన్న హరికృష్ణ జన్మదిన వేడుకలు ఆయన మిత్రులు, ఆత్మీయులు పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మిత్రుడు బలరాం జాదవ్ మాట్లాడుతూ ప్రసన్న హరికృష్ణ పేద విద్యార్థులకు ఎంతగానో కృషి చేశారని అన్నారు. తను రాసిన పుస్తకాలు ఎందరికో ఉచితంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా విద్యార్థులకు అందజేశారని అన్నారు. తను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న సమయంలో 30శాతం వేతనంలోని డబ్బులు పేద విద్యార్థులకు సాయం చేసే మంచి గుణం ఉన్న వ్యక్తిని అన్నారు. ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్, రెబల్ అభ్యర్థిగా పట్టభద్రుల ముందుకు వస్తున్నారన్నారు. ప్రసన్న హరికృష్ణ పట్టభద్రులందరూ గెలిపించుకొని పెద్దల సభకు పంపాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్, రమణగౌడ్, అల్లం సాయికృష్ణ, శ్రీనివాస్, కిషోర్, గణేష్, స్వామి, నవీన్ పాల్గొన్నారు.

11 నుంచి బడాపహాడ్ ఉర్సు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని బడాపహాడ్‌లోని సయ్యద్ షాదుల్లా హుస్సేన్ బాబా ఉర్సు ఉత్సవాలు జనవరి 11 నుంచి 13 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దులహుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉర్సు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, వక్ఫ్‌బోర్డు ఇంచార్జి పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సావాలు జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని స్థానిక అధికారులకు తెలిపినట్టు పేర్కొన్నారు. భక్తుల నిమిత్తం అన్ని విధాలా వసతులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవాలకు స్థానిక వక్ఫ్‌బోర్డు అధికారులు సద్దాం హుస్సేన్, వక్ఫ్‌బోర్డు డిప్యూటీ జమాల్ చూస్తారని పేర్కొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా గణేష్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నునావత్ గణేష్ నాయక్ ఎన్నికైనందుకు తెలంగాణ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గణేష్ నాయక్ డైరెక్టర్‌గా ఎన్నికైనందుకు డాక్టర్ తేజావత్ బెల్లయ్య సన్మానించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్, జిల్లా వైస్ చైర్మన్ నరేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ట్రాన్స్‌ఫార్మర్‌కు నిధులు మంజూరు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.2.4 లక్షల నిధులు మంజూరైనట్టు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు ఆదివారం తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి పాఠశాలలో విద్యుత్ లోడ్ ఎక్కువ కావడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. విషయాన్ని ఎమ్మెల్యే మదనమోహన్ రావు దృష్టికి తీసుకెళ్లగా ఎస్‌డిఎఫ్ నిధి నుంచి నిధులు మంజూరు చేశారని తెలిపారు.

ఆలయం అభివృద్ధి కోసం కృషి చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని శివరామ్ మందిరం ఆలయ కమిటీ అధ్యక్షులుగా అంజయ్య, లక్ష్మి నారాయణ ఆలయ కమిటీ అధ్యక్షులుగా పుర్రా బాపురెడ్డి, కమిటీ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ డైరెక్టర్‌లు నాయిని లింగారెడ్డి, చింతల చిరంజీవి, నాగారం నర్సింలు, చిన్నం స్వాతితో పాటు లక్ష్మి నారాయణ ఆలయ కమిటీ అధ్యక్షులు పుర్ర బాపురెడ్డి, డైరెక్టర్‌లు గాజులపల్లి శేఖర్ రెడ్డి, లింగ రాజేందర్, నగురం నర్సింలు, ఆరెపల్లి గాయిత్రిని కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి, అబ్రబోయిన స్వామి, తాటిపల్లి శ్రీకాంత్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోండి

నవతెలంగాణ-బోధన్/బోధన్‌టౌన్

మందర్న గ్రామం సమీపంలోని మంజీర నది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా కట్టడి చేయాలని ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై చట్టరీత్యా కఠినంగా చర్యలు తీసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం సాలూర మండల కేంద్రంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొని ఏసిపి శ్రీనివాస్, సాలూర తహసీల్దార్ శశిభూషణ్‌లకు ఇసుక అక్రమ రవాణా కట్టడిపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, చట్టరీత్యా చర్యలు తీసుకుని వారిని కట్టడి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతి ద్వారా నిబంధనల మేరకు రుసుము చెల్లించిన వారికి మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలని సూచించారు. కొంతమంది ఇష్టారీతినా ధరలు పెంచేసి ఇసుక రవాణా చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు, ఇతర నిర్మాణాలకు ఇసుక అత్యవసరం కనుక సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండేలా ధరలు ఉండాలని తెలిపారు. అంతేకానీ ఇష్టరీతినా ధరలు పెంచుతూ ఇసుక అమ్ముకుంటున్న వారిని ఎవరినీ వదలబోమని ఆయన హెచ్చరించారు.

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ కార్యవర్గం

నవతెలంగాణ-తాడ్వాయి

ఉపాధ్యాయ సెకండరీ గ్రేడ్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్టు ప్రధాన కార్యదర్శి పుల్లూరు స్వామి తెలిపారు. బాన్సువాడ మండల అధ్యక్షులుగా హీరాలాల్, ఉపాధ్యక్షులుగా సంజయ్ రాథోడ్, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, కన్వీనర్‌గా శ్రీకాంత్ ఎన్నికైనట్టు తెలిపారు.

సోయా పంట కొనుగోళ్లు 7 వరకు పొడిగింపు

నవతెలంగాణ-మద్నూర్

కామారెడ్డి జిల్లాలో సోయా కొనుగోళ్లను ఈ నెల 7న పొడిగించినట్టు జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం మద్దతు ధర కొనుగోలు కేంద్రాలు 9 ఉన్నట్టు తెలిపారు. జనవరి ఒకటి 2025 నాటికి జిల్లాలో మొత్తం 8071 మంది రైతుల నుండి 1,37,871 క్వింటాళ్ల సోయా పంట కొనుగోలు చేసినట్టు వివరించారు. మార్క్‌ఫెడ్ ద్వారా సోయా పంటకు క్వింటాకు 4892 రూపాయలు మద్దతు ధర ప్రకటించినట్టు తెలిపారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావుకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ఎల్లారెడ్డి నియోజకవర్గం మరింత అభివృద్ధి జరిగే విధంగా కృషి చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య, నాయకులు విక్రాంత్‌రెడ్డి, మధు, గోపాల్, రవిగౌడ్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

త్రిలింగ రామేశ్వర ఆలయ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్ గ్రామంలో గల త్రిలింగ రామేశ్వర ఆలయ క్యాలెండర్‌ను ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య, నాయకులు విక్రాంత్‌రెడ్డి, గోపాల్, ఆలయ ధర్మకర్త దత్తు ఉన్నారు.

అన్ని రకాల పంటలకూ బోనస్ చెల్లించాలి

నవతెలంగాణ-తాడ్వాయి

అన్ని రకాల పంటలకు బోనస్ వర్తింపజేయాలని కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షులు పైడి విటల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతుకూ రుణమాఫీ అన్ని రకాల పంటలకు బీమా వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంఘం మండలాధ్యక్షులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-పొతంగల్

మండలంలో పాబ్బ శేఖర్, గోల్డెన్ జిమ్ ఆధ్వర్యంలో సంజీవిని హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరానిన సద్వినియోగించుకోవాలని సూచించారు.

సహకార సంఘం సలహా కమిటీ సమావేశం

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని సహకార సంఘం సలహా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సమావేశంలో జీఎస్టి, ఆదాయపు పన్ను, తదితర చెల్లింపులపై చర్చించారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ రియాజ్ ఉద్దిన్, వెంకటేశ్వర్ రావు, ఇంచార్జి సెక్రటరీ శివాజీ, సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడిన బోధన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో సొసైటీ చైర్మెన్ అల్లే జనార్దన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న సాలూర క్రికెట్ టోర్నమెంట్ సీజన్-4 పోటీలను ఆదివారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని ఎమ్మెల్యే క్రికెట్ ఆడారు. యువకులు బౌలింగ్ చేయగా కార్యకర్తల ఉత్సాహం మేరకు ఎమ్మెల్యే బ్యాట్ పట్టి బంతిని బౌండరీ దాటించారు. ఆయన వెంట టోర్నమెంట్ నిర్వాహకులు అల్లె జనార్దన్, అల్లె రమేష్, సురేష్ పటేల్, రాహుల లక్ష్మణ్, క్రీడాకారులు ఉన్నారు.

చైతన్య రథానికి రూ.2లక్షల విరాళం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణజివాడి గ్రామ చైతన్య రథానికి వివిధ కుల సంఘాలు రూ.2లక్షల విరాళం అందజేసినట్టు బాలవికాస ప్లాంట్ సభ్యులు ఆదివారం తెలిపారు. వికాస ప్లాంట్ నుంచి లక్ష రూపాయలు అందజేయగా ముదిరాజ్ సంఘ సభ్యులు రూ.31వేలు, పద్మశాలి సంఘం రూ.15వేలు, రెడ్డి సంఘం రూ.51వేలు, నాయి బ్రాహ్మణ సంఘం రూ.3వేలు, శాలివాహన సంఘం రూ.2వేలు విరాళంగా బాలవికాస ప్లాంట్ సభ్యులకు గ్రామ సంఘాల సభ్యులు అందజేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.